


**వర్షంలో శిథిలగృహంలో ప్రాణపాయ స్థితిలో చిక్కుకున్న అల్పజీవి ఆవేదన!**

ఈ సారి వర్షాలు ప్రతిసారికంటే మరీ ఎక్కువగా ఉన్నాయి. రోడ్లన్నీ దెబ్బ తిని అక్కడక్కడ పగిలిపోయాయి. మరికొన్ని స్థలాల్లో బాగా చెక్కుకుపోయాయి. అందులో నిండిన నీరు గుంట లోతుల్ని తెలియకుండా కప్పేసింది.

మూడు రోజుల వాన నుంచి యింట్లోనే కూర్చున్నాడు రామం. అతనికి బయట కాలు పెట్టేందుకు బలమూలేదు, వీలూలేదు. జ్వరతీవ్రత కాల్చేస్తున్నప్పుడు కలవరిస్తూ కొంచెం తగ్గినప్పుడు అమ్మా, అయ్యో అంటూ మూల్గుతూ కుక్కిమంచంలో దొర్లుతున్నాడు. ఈ మూడు రోజులనించి ముఖం కడుక్కునేందుకు నీళ్ళయినా యిచ్చేందుకు ఎవ్వరూలేరు.

కనీసం గది ఊడ్చే పనిమనిషికూడా రాలేదు. దానికీ జ్వరమేనట. పాతపడిన పెంకుటిల్లు గోడ బాగా తడిసింది. ఈ రెండు రోజుల్లో అందులో పగుళ్ళుకూడా ఏర్పడ్డాయి. తను ఈ మంచం మీదనుంచి లేవలేడు. తనకు శక్తిలేదు. నిన్న ప్రయత్నం చేసి మంచంమీదనుంచి రెండు అడుగులు వేశాడోలేదో కళ్ళు చీకట్లు కమ్మి పడిపోయాడు. నేలకు తలకొట్టుకొని తల చిట్లింది. తను స్పృహలోకి వచ్చేటప్పటికి నుదుటి రక్తం ఎండిపోయింది. వొళ్ళంతా విపరీతంగా నొప్పులు.

ఈ ఇంట్లో ఉండాలంటే భయంగా ఉంది.

కాని ఇంట్లోంచి బయటకి వెళ్దాం అంటే కుంభవృష్టిగా వాన. ఒక రిక్షా అయినా ఈ వీధిలో కనపడదే, మోరీ బాగా నిండినట్లుంది. ఇంట్లోకి వాన నీళ్ళు వచ్చేస్తున్నాయి. ఈ వర్షం ఇలానే యింకొక్క పన్నెండు గంటలు ఉందా అంటే ఇల్లు కూలడం ఖాయం.

నిన్న తలకే కాకుండా కాలుకూడా మెలిపడింది. చీలమండంతా వాచి బలే నొప్పిగా ఉంది.

హే భగవాన్! ఎవరేనా వొచ్చి నన్ను ఆసుపత్రిలో అయినా చేర్పించినా బాగుండునే- ఈ జ్వరంతో అయినా నాలుగు రోజులు బ్రతికే అవకాశం వుంది. కాని ఈ యిల్లు కూలితేనా తను బ్రతకడు. భూస్థాపితం అయిపోతాడు.

ఎవరేనా స్నేహితులు వచ్చినా బాగుండేది తన అవస్థ చూసి తన్నో సేఫ్ స్థలంలోకి మార్పించేవారు. ఈ వానలో ఎవరు వస్తారు. ఆకాశంలో ఉరుములు ఎక్కువయాయి, ధడేల్ మంటూ దూరంగా ఎక్కడో పిడుగు పడింది. ఆ అదురుకు గోడ సున్నం పెళ్ళ కాలిమీద పడింది. ఇక మొదలయింది రాయి పడటం. సున్నం పడ్డంతో ఆరంభం అయింది. ఇక ఇటుకలతో సమాప్తం అవుతుంది. ఇంకో ఉరుము ఉరిమిందా ఈగోడ తన్ను మింగేస్తుంది.

ప్రక్కవాటాలో తలుపు చప్పుడు.

కనీసం తన తలుపును ఎవరు అయినా తట్టకూడదూ తన స్నేహితులయినా. అయినా యింత వర్షంలో తన యింటికెవరు వస్తారు. ప్రకృతి అంతా కడు రమణీయంగా ఉన్నప్పుడే తనయింట్లో కాలు పెట్టేవారు కారు ఎవరూ. ఇప్పుడు ఈ వానలో తనకా అదృష్టం లేదు. తను యిలా చావవలసిందె.

వేమన
పద్యరత్నాకరము
2500 పద్యములకు తాత్పర్యం
700 పేజీలు
వెల రూ. 20/- పోస్టేజి అదనం.
బాలసరస్వతీ బుక్ డిపో
6. సుంకురామ చెట్టి వీధి,
మద్రాసు–600 001.
ఫోన్ : 29868.

డా॥పి.వి.కె.రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్

వైద్య విద్వాన్ వైద్యాచార్య హస్తప్రయోగం. వరముల బలహీనత అంగము చిన్నద గుట. శీఘ్రస్ఖలనము శుక్ల నష్టము. సుఖరోగములకుమావ సిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.
రావూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700.

SUVARNA

తెల్ల మచ్చలు
మా స్వస్తికా బూటీ తెల్లమచ్చ రంగు సమూలంగా త్వరితగతిని మామూలుగా మార్చును. 2 నెలలకు ఒక సీసా ఉచితంగా ఇవ్వబడును.
తెల్ల వెంట్రుకలుండవు
పొగడడం మాకు ఇష్టంలేదు. కాని మా 'కేష్‌రంజన్' ఆయుర్వేదిక్ పెంపెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్ల వెంట్రుకలను నల్లవిగా మార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధి పరచును. లాభం పొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 12/–.
SHYAM AYURVED BHAVAN (S-5)
p. o. Katri Sarai (Gaya)

అయినా ఆ పనిది తొందరగా నయం అయివస్తే.

అది బాగున్నా ఎక్కడ వస్తుంది. అంతా బాగున్నప్పుడే ఒక రోజు వస్తే మూడు రోజులు నాగాలు. ఇంత వానలో వస్తుందా.

చూరు మీద నుంచి నీటి చుక్క వచ్చి కంట్లో పడింది. ఛీ కన్ను కూడా తెరుచుకొనేందుకు యోగ్యత ఉన్నట్టు కనబడటం లేదే? కళ్ళు మూసుకున్నాడు. ప్రక్కకు వత్తిగిలి–కళ్ళు తెరిచాడు.

సున్నం వెలిసిపోయిన గోడ వానకు ఉబికి వున్న గోడ- కళ్ళలో గుచ్చుకుంటూంది. మూడేళ్ళ క్రిందటే ఇంటాయన–బాబూ వచ్చేది వానాకాలం రెండు వానలు గట్టిగా కొట్టాయంటే ఈ ఇల్లు నిలవదు. కొంచెం ఎడ్వాన్సుగా డబ్బిస్తే నేను ఇల్లు బాగుచేయిస్తానన్నాడు.

తను నవ్వుతూ- ఈ ఇల్లు మొండిది. అంతకంటే మొండివాడ్ని నేను. మా ఇద్దరికీ ఏం కాదు అన్నాడు నిర్లక్ష్యంగా.

తననోట్లో శనిగాడు ఉండి,అలా పలికించాడు. ఆ రోజే ఏదో కొంతడబ్బు పడేసి ఉంటే – తను ఇలా భయంతో చచ్చేవాడు కాదుగా.

తన పనిమనిషి కూతురూ సమయానికి లేదు. అదే ఈ సమయంలో దాని మొగుడి దగ్గరే చావాలా. వాడు నెలకు పది రోజులు ఊరులో ఉంటాడు. మిగిలిన రోజుల్లో టూర్లంటూ కొడతాడు. అది ఆ మిగిలిన రోజులన్నీ తనతో సరసా లాడుతూ కూర్చుంటుంది.

అది వచ్చినా బాగుండేది. అన్నీ కలసి వచ్చేయి తన వధకు.

ఇంట్లోంచి నీళ్ళు గలగల పారుతున్నాయి. తూము మళ్ళీ నిండి పోయినట్లుంది. మంచంమీదనుంచి నీళ్ళలో చేయి వేసి ముఖం తుడుచుకున్నాడు. బురద కంపు కొడుతున్నాయి.

దాహం అవుతూంది. నోరు పిడచకట్టుకుపోతూంది. దోసిటితో నీళ్ళు తీసుకొని నోట్లో పోసుకున్నాడు. మడ్డిమడ్డిగా అనిపించింది. ఏదో ఏమీ లేని దానికంటే కొంచెం నయం అనుకున్నాడు.

కనీసం రాధ వున్నా బాగుండేది. ప్రక్క పోర్షన్‌లోంచి ఏదో నెపం పెట్టి – తన గదిలోకి వచ్చేసేది దొంగతనంగా. వయస్సులో ఉందేమో - మొగుడు చచ్చి విధవరాలయిందేమో – తన్ను చూడక పోతే ఆమెకు వొళ్ళు కంపరం ఎత్తి పిచ్చి ఎత్తిపోయినట్లుండేది. అప్పుడప్పుడు దొంగతనంగా వచ్చి ఏదో తృప్తిపడి వెళ్ళేది.

తన అదృష్టం బాగుండక – ఆ ఇంటిల్లిపాదీ పొరుగూరికి పెళ్ళికంటూ వెళ్ళారు.

"వారం రోజులకంటే ఎక్కువ నీటిని స్పృశించకుండా ఉండగలనా" అంటూ తన పెదాల్ని చూపించింది వెళ్ళేముందు. పది రోజులయినా ఇంకా పత్తాలేదు. ఇదంతా చూస్తే ఈ గోడ కూలేలోగా ఎవరూ వొచ్చేటట్టులేరు.

తన చావు ఇలా రాసి వుంది.

ఈ సంవత్సరాంతంలో పెద్ద గండం అంటూ సంవత్సరం మొదట్లో ఈ సంవత్సర విశేషాలు తన స్నేహితుడు చదివినప్పుడు 'ఫు' అంటూ పుస్తకం మూసేసి అతన్ని చదవ నివ్వాడుకాదు. తను చదవ నిచ్చినా బాగుండేది. ఇంత ఆత్రత పడే వాడుకాదు.

ఇంతలో ఫెడేల్‌మన్న శబ్దం.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. తన గదిగోడ యింకా కూలలేదు. నిక్షేపంలా భయపెడుతూ యింకా ఉంది.

బయటనుంచి హృదయ విదారకంగా ఆర్తనాదాలు.

అబ్బ! ఈ వీధిలో మొదలయింది యిళ్ళు కూలడం. అన్నీ పాత పెంకుటి కొంపలే. ఈ వీధిలో ఒకటి మొదలయిందంటే చాలు యింక వరస వరస కూలిపోతాయి.

అన్నిటికంటే అధ్వాన్నంగా ఉన్న కొంప తనదే. కూ్తే మొదలు తన ఇల్లే కూలాలి. కాని దానికి విరుద్ధంగా రెండిళ్ళ అవతల కొంప కూలి- ఇలా వాళ్ళ మూల్గులు తన చెవిలో పడుతున్నాయంటే ఈ చావు- ఈ దరిద్రపు చావు-- తన్ను హడలగొట్టాలనేకదూ- ఈ బ్రతికున్న నాలుగు గడియలూ భీతితో చంపాలి అనే కదూ.

అప్పటిదాకా నిర్మానుష్యంగా శ్మశానంలా ఉన్న వీధి చైతన్యంతో చిందులాడ సాగింది.

రోడ్డుమీద ఎవరో పరిగెడ్తున్నారు. ఎవరో ఏదో అంటున్నారు గటిగా. శబ్దం తప్ప స్పష్టంగా ఏమీ వినపడటంలేదు.

ఇంతలో తన గది ముందర నుంచి ఎవరో పరిగెడ్తూ పాపం సీతమ్మ అన్నారు గట్టిగా. అయ్యో సీతమ్మకు ఈ క్షణంతో నూకలు చెల్లిపోయాయేమో. పాపం మొగుడు చచ్చి మూడేళ్ళయినా, వున్న ఇద్దరు పిల్లలకు తనే తల్లీ తండ్రి అయి పోషిస్తూంది.

మొగుడు పనిచేసిన ఆఫీసులోనే ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకుంది. ఒచ్చే జీతంతో ఈ మూడు పొట్టలు వెళ్ళ తీస్తుంది.

తను అనేవాడు ఎప్పుడేనా నీకెందుకు సీతమ్మా ఈ బాదరబందీ అంతా.నువ్వే

రోగిష్టి మనిషివి. వీళ్ళని ఎక్కడేనా అనాధ ఆశ్రమంలో చేర్పించి, నీ ఒక్క పొట్టకూ ఇంత సంపాదించుకొని హాయిగా ఉండక—అంటే -

"లేదు రామం బాబూ. వీళ్ళని శుభంగా చదివించి పైకి తీసుకురావాలి. దానికి ఈ రక్తం అంతా ధారపోసేందుకు నేను తయారే ఆ భగవంతుడు చల్లగా చూడాలి కా" అనేది.

ఆ త్రాగుబోతు వెధవ, పుండాకోర్ వాడికి యింతమంచి ఆశయాలున్న భార్య ఎలా దొరికిందో అని తను అప్పుడప్పుడు ఆశ్చర్యం పొందేవాడు.

ఆమె మాటల్లో తన చిన్నతనం జ్ఞప్తికి వచ్చేది. తన తండ్రైనా తల్లైనా యిద్దర్లో ఏ ఒక్కరైనా తన కొడుకు భవిష్యత్తు గొప్పగా ఉండాలని అనుకొని ఉంటే - తను ఇలా ఈ పెంకుటింట్లో ఈ తక్కువ దశలో మగ్గిపోయేవాడు కాదు. తన హృదయం ఏ భావం లేక ఇలా బండ బారిపోయి ఉండేదికాదు.

గుండ్రమయిన ఆ కళ్ళని తిప్పుతూ మావయ్యా నేను క్లాసులో ఫస్ట్ అనేటమ్మ కూతురు దాని తరువాత వాడు వాళ్ళగతేం కావాలి.

ఈ బ్రతుకులు అనుకున్నవేవీ జరగనంత అస్థిరంగా వున్నాయి.

తనే వాళ్ళను తెచ్చేసుకుంటే తనతో వుంచుకొని వాళ్ళ భవిష్యత్తు రూపు తిర్చి దిద్దితేనో.

ధడేల్ అని ఇటికపెళ్ళంత సున్నం నీళ్ళలో పడి ఫట్ అని శబ్దం అయింది. చిందిన నీళ్ళు తన ముఖాన్న వచ్చి పడ్డాయి.

గోడవంక చూశాడు—ఈ క్షణమో మరుక్షణమో వున్నట్లుంది, రోడ్డుమీద నిముషానికి వొకరు ఇటూ అటూ పరిగెడ్తున్నారు.

అబ్బ ఇంతమందిలో ఒక్కడు తన గదిలోకి వచ్చినా బాగుండును. కావాలని రాకపోయినా పొరపాటున అయినా రారే?

తనను ఇక్కడనుంచి కదిలేందుకు ఎవ్వరూ రారు. తనకు సహాయం అంటూ ఉండదు. తన స్వశక్తిమీదే ఆధారపడి ఉండాలి.

మంచం మీదనుంచి లేచి నిలబడ్డాడు ఒంటికాలిమీద. రెండోపాదం ఆనించేందుకు ప్రయత్నించాడు. కాలు కత్తితో పొడిచినట్లు నొప్పి పెట్టింది. కళ్ళు తిరుగుతున్నాయి. లాభంలేదు తను ఈవాచిన కాలితో కళ్ళు తిరిగే స్థితిలో ఈ గదిలోంచి బయట పడలేడు.

తను ఎందుకింత భయపడిపోతున్నాడు. అర్ధరాత్రి రెండుగంటల సినిమా ఆటచూసి ఒంటరిగా వచ్చే తను ఎవరైనా ఆపదలో ఉంటే తన వెనక ఎవరూ సపోర్టు లేకపోయినా ఒంటరిగా కలియపడే తను చావంటే చిరునవ్వుతో స్వీకరిస్తా అని అనుకొనే తను ఎందుకింత భయపడిపోతున్నాడు.

ఎందరివో చావుల్ని ఈ కళ్ళతో చూశాడు. అన్నిటికంటే మరీ దగ్గరగా చూసింది తల్లి చావు.

తండ్రి ఒకరోజు మధ్యాహ్నం రౌద్రంగా యింట్లో ప్రవేశించి త్రాగిన మైకంలో గండ్రగొడ్డలితో తల్లి తల తెగనరికాడు, ఆమెకు మరొకడితో సంబంధం వున్నదన్న అనుమానంతో.

ఆ సమయంలో అన్నం తింటున్న తన మీద తల్లి వెచ్చని రక్తం చిందింది. అంత భీభత్సంలో కూడా తన మనస్సు చెదరలేదే. అటువంటిది ఈ రోజు తను ఎందుకిలా నీరుకారిపోతున్నాడు? ఈ భయం అనే బీజమే తనలో లేకుంటే.

వాన ఉధృతం ఇంకా ఎక్కువయింది. కిటికీలోంచి ఎక్కడా ఆకాశం ముక్క కనపడటంలేదు. మేఘాలతో దట్టంగా కాటుక పెట్టుకున్నట్లు వుంది ఆకాశం.

యాంబులెన్సు, పోలీసు వచ్చినట్లుంది. యాంబులెన్సు శబ్దం పోలీసు కారు సైరన్ వినపడుతున్నాయి.

ఇంత మంది తన గది ముందర నుంచి వెళుతున్నారు. ఇందులో వొక్కడికి తన అవస్థ తెలిసినా తను బ్రతికిపోగలడు. తన వెర్రిగాని వాళ్ళకు తెలిసేది ఎట్లా?

కిటికీలోంచి ఎవరిదో బుర్ర కొంచెం


మార్గో సబ్బు

కేవలం చర్మాన్ని శుభ్రపరచటమే కాదు-దానికి క్రిమి సంహారక, ఏంటీ ఫంగల్ లక్షణాలు కూడా ఉన్నాయి.

యీ మధ్యనే ప్రచురించిన ఒక ప్రఖ్యాత పరిశోధనా కేంద్రం యొక్క పరీక్షల ద్వారా యీ విషయంవెల్లడయింది.

ప్రకృతి యొక్క ప్రత్యేత కానుక నీమ్ ఆయిల్ [వేపనూనె]తో తయారు చేయబడింది మార్గో సబ్బు, మార్గో సబ్బు కేవలం చర్మాన్ని శుభ్రపరిచే 'టోయ్‌లెట్' సబ్బు మాత్రం కాదు. దీనిలా ప్రకృతి సిద్ధమైన మూలికలు, ఔషద లక్షణాలు పూర్తిగా వున్నాయి

ఈ కారణం వల్ల మార్గో సబ్బు 1920 నుండి నేటివరకు ఒకే విధంగా జనప్రియమైని.

అన్నివయస్సులవారికి —అన్ని కాలాలకు చర్మాన్ని ఆరోగ్యంగా, సౌందర్యంగా ఉంచటానికి ఒకే ఒక సబ్బు—మార్గో




IDL/MGN/1Te



మార్చి 5వ తేది మద్రాసు కళాసాగర్ ఏర్పాటు చేసిన "మూన్‌లైట్ డిన్నర్ ప్లస్ లైట్ మ్యూజిక్" కార్యక్రమంలో పాల్గొన్న నేపథ్య గాయకుడు శ్రీ పి. బి. శ్రీనివాస్

కనపడుతూంది. తన చేతిలో ఏది అయినా రాయిగాని, లేక అంతకంటె బలమైన వస్తువుగాని ఉంటేనా- అది విసురుతే అది వాడికి తగిలి నన్ను రాయితో కొడతావా అని పోట్లాట పెట్టుకునేందుకయినా వచ్చి ఉండేవాడు. గదిలోకి వచ్చినప్పుడు తండ్రీ ఏ పూర్వజన్మ ఫలమో ఈ రోజు దేవుడిలా వచ్చేవు. నిన్ను కొట్టాలని కాదు. ఆ కాశ్యేవో మా ఇంట్లో కూడా పడేయించుకొని ఈ ఇల్లు పావనం చేయించుకొని నీకు నా గోడు విన్నవించుకొని ఈ ఇంట్లోంచి బయటపడ్తామని అంటూ తను బ్రతిమాలుకొనేవాడు. ఇదంతా తన రాయి తగులుతేనే కాని తగులుతుందని గ్యారంటీ ఎక్కడ? మొదట తనకు బలంగా విసిరే శక్తి ఉండాలి. అంత బలంగా విసిరిన రాయి కిటికీ అద్దం బ్రద్దలుకొట్టి కిటికీ ఊచలకు తగలకుండా ప్రయాణంచేసి – వాడి తలకు తగిలి వాడేదో పోట్లాట పెట్టుకొనే రకంగా వుండి తన ఇంట్లో దూరితే అప్పుడు. వారే గాని – ఏదో నిర్లక్ష్యంతో ఎవరో పిల్లలు విసిరి వుంటారు పోనీలే అంటూ మహా చులకనగా తీసుకొనే మనిషే అయివుంటేనా – తనను ఈ గోడలే కప్పుతాయి.

యాంబులెన్సు గావాల్ను బయట వెళ్ళిపోయిన శబ్దం. పాపం సీతమ్మ ఎలా వుందో – అసలు బ్రతికి ఉందోలేదో? బ్రతికినా అవిటిదో – గుడ్డిదో అయితే ఇక ఆ పిల్లల గతేంకాను? అయినా అంత ఇల్లు ఆ ఎముకల గూడు మీద పడితే అవిటిదేం అవుతుంది. అసలుకే మోసం వస్తుంది.

ఇంకా అరగంటో గంటో – తిరిగి యాంబులెన్స్ ఈ వీధిలో ప్రవేశిస్తుంది తన్ను మోసుకుపోడానికి. ఇవాళ ఈ పోలీసులకూ- ఈ యాంబులెన్స్ వాళ్ళకీ చేతినిండా పని. వాళ్ళు తన్ను తిట్టుకుంటారేమో, ఈ దరిద్రుడు చేతినిండా పని ఉన్నప్పుడు చావాలా? తాము ఖాళీగా ఉన్నప్పుడు చావకూడదా అంటూ.

ఇంతలో చాటంత సున్నంపెళ్ళ విరిగి మంచంమీద పడింది. గోడలో పెద్ద వెంకటేశ్వరస్వామి పటం అంత స్థలం బోడి అయింది. సున్నం లేకుండా ఆ పడ్డ దెబ్బకు పాత మంచం ఏమో కిర్‌మంది. గోడలో సున్నం అయిపోయింది. యిక యిటుకలు పడడమే తరువాయి. ఈ కప్పు కప్పూ తనమిద వచ్చి ఒరిగిందంటే తను బ్రతికినా ఎందుకయినా పనికొస్తాడా?

నాలుగిళ్ళ అవతల పెద్ద బిల్డింగ్ వుంది. అందులో ఉన్నాడు మహాపాపి. ఈ వీధిలో ఉన్నాళ్ళందరికీ అప్పిచ్చి పెద్ద వడీలు గుంజుతూ వాళ్ళ రక్తం పీల్చేస్తున్నాడు. సూర్యోదయం అయిందంటే ఈ వీధిలోని అందరి ఉసురూ పోసుకుంటాడు. ఈ స్థితి అతనికైనా ప్రాప్తించ కూడదూ? తనూ అతనికి బాకీ ఉన్నాడు నెలకు నూరు రూపాయల వడ్డీ కడుతున్నాడు. వడ్డీ చెల్లించడం కొంచెం ఆలస్యం అయితేచాలు తన్నేందుకు వస్తాడు. బాదంపప్పు తిని చేతులు అరటి దువ్వల్లా తయారయాయి. అలాటివాడు తన్ను ఒక్కటి తన్నితే చాలు. ఈ లోకంలో ఉండడు. తనేంత పాపం చేసుకున్నాడో పోయిన జన్మలో తన చావుని గురించి తనే బెదురుతూ ఆహ్వానిస్తూ ఇలా కూర్చున్నాడు.

పీడించేవాళ్ళూ- పాపాత్ములు తనున్న పరిస్థితుల్లో ఉండే ఎందుకు చావకూడదు. దేశానికి ఉపకారం అయినా జరిగినట్టుంటుంది. వాళ్ళు చావరు. ఎల్లప్పుడూ


మొత్తం 54 గల నమూనా

| | | | |
|---|---|---|---|
| 12 | 17 | 10 | 15 |
| 21 | 6 | 19 | 8 |
| 14 | 13 | 16 | 11 |
| 7 | 18 | 9 | 20 |

## గొప్ప అవకాశం

(ట్రాన్సిస్టర్ల ప్రచారం కొరకు మరియు అమ్మకమునకు చేయు పథకం)

మొదటి బహుమతి; మొత్తం సొల్యూషన్ సరియైనది అయినచో ఒక వెయ్యి నగదు. రెండవ బహుమతి; పై మూడు అడ్డ వరుసలలో సరియైనది అయినచో అయిదు వందలు నగదు. మూడవ బహుమతి: (200)లేక అందరు ఎంట్రీదారులకు ఎక్కడైన ఏ అంకైన సరియైనది అయినచో సోని 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టరు ధర : 270/–లో సగం ధర. నిబంధనలు: దిగువ వీయబడినవి జాగ్రత్తగా చూడండి. 1. ఖాళీ కాగితముపై 7 నుండి 22 వరకుగల అంకెలను ఉపయోగించి ఎటు కూడినా మొత్తం 58 వచ్చునట్లు వేయాలి. 2. సీల్డు సొల్యూషన్ మా కార్యాలయమునందుంచబడినది. అది ఎమ్. డి. చే స్వయంగా తెరువబడును. 3. ఈ పోటీకి ఎంట్రీ ఫీజు లేనందువల్ల మొదటి మరియు రెండవ బహుమతులు ఈ సీల్డు సొల్యూషన్‌తో సరిపోయినప్పుడు మాత్రమే ఇవ్వబడును. అట్లు లేని యెడల మొదటి. రెండవ బహుమతులుండవు. 4. మూడవ బహుమతి గెలుపొందినవారు పోస్టేజి ఖర్చులు మొదలయినవి చెల్లించాలి. 5. మూడవ బహుమతి గెలుపొందినవారికి నగదు బహుమతులుండవు. 6. ఫలితము మరియు స్టేషనరీ కొరకు 45 పైసల స్టాంపులు పంపండి. 7. ఒక ఎంట్రీదారుడు ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. 8. లావాదేవీలు అలీఘర్ సివిల్ కోర్టునందు మాత్రమే.

ముగింపు తేదీ : 24-4-77    ఫలితం : 26-4-77

MAYUR TRADERS (AJS-58) Jaiganj, ALIGARH-30.

ఏటుపడు:

# ఉగాది పంచాంగం




"పండుగ బట్టలు తేలేదా?" పిల్లల గొంతులో ఏడుపు జీర,
సాగదీస్తుంది శ్రీమతి. "ఇంకా కొనలేదా కొత్త చీర?"
"పండగ మామూలు బాబూ!" -మధ్యలో పనిమనిషి నసుగుడు
అనుకోకుండా దూరపు చుట్టం సకుటుంబంగా రైలు దిగుడు
వరమో, శాపమో_ ఆఫీసుకు రమ్మని వస్తుంది అంతలో
అర్జంటు పిలుపు
అంగుట్లో అంతా చేదే-అయిపులేపు తీపి, పులుపు.

—భండారు పర్వతాలరావు

బ్రతికే వుంటారు. దేవుడూ వాళ్ళతో కలిసి పోయాడు కాబట్టి.

వాన కొంచెం తగ్గిస్తుంది. ఇంట్లో నీళ్ళు లెవల్ కొంచెం తగ్గింది.

ఇదంతా ఎందుకాలోచించడం. శుభ్రంగా ఈ ఆఖరి క్షణాల్లో రామనామం చేసుకుందాం.

ఇంతలో తలుపు ఎవరో తోస్తున్నట్లని పించింది. కళ్ళు మరీ పెద్దవి చేసుకొని తలుపుకేసి చూశాడు.

తను పొరపడలేదు. తలుపు ఎవరో తోస్తున్నారు. తను అదృష్టవంతుడు. గొళ్ళెం పెట్టకుండానే తలుపుని అలానే విడిచేశాడు ఈ మూడు రోజుల్నించి. తలుపు వానకు బిర్రబిగుసుకుపోయినట్లు న్నాయి.

అవ్వాతోసేవాళ్ళు ఎవరో మహా నాజూగ్గా తోస్తున్నారు. ఆడపిల్ల అయి వుంటుంది.

ఇంటి ఓనరు కూతురయితే కాదుకదా. ఆమె వస్తే తమ మధ్య ఈ తలుపును ఇంతసేపు నిలువనిచ్చేదా. తలుపును పగల గొట్టి లోపలకు ప్రవేశించకపోయేదా?

ఇంటి ఓనరు కూతురు కాకపోతే మరొ కరి కూతురు ఎవరయితే తనకేం. ఎవరు వచ్చినా తనకు సహాయం దొరక్కపోదు.

ఆశతో తలుపువైపు చూడసాగాడు తలుపు మెల్లగా తెరచుకుంది. ఆత్రంతో తలుపు సందులోంచి చూశాడు. అబ్బ ఇదా_ నా ఆశలు అంతా కూల్చేసిందే ఈ వెర్రి కుక్క_ మూడు రోజులు ఎక్కడ తగ లడిందో తోక ఆడించుకుంటూ దగ్గరకు వచ్చింది. తన దగ్గరగా వచ్చి తల ఎత్తి చూసింది.

నిరాశగా చూశాడు దాని కళ్ళలోకి.

ఇంక తన ఆశ తన్ను వీడిపోయింది. ఈ యింటిలోంచి తను బయటపడే మార్గమే లేదు.

తను చేయి దానిమీద వేశాడు. చల్లగా మంచుముక్కలా వుంది దానివొళ్ళు. పాపం మూడు రోజులూ తిండిలేక వానలో ఎక్కడ వుందో?

అప్పుడప్పుడుయింత మిగులూ, తగులూ వేసినందుకు తన ఆఖరి క్షణాల్లో పరామర్శ చేసేందుకయినా ఒచ్చింది. ఆప్యాయంగా దాని ఒళ్ళు నిమిరాడు.

అబ్బ ఈ జ్వరంలో_ తిరిగి చలి ఆరంభం అయిందేం ఇది వొస్తే ఒకగంట గడగడ ఆడిస్తే కాని పోదు. గట్టిగా మంచాన్ని పట్టుకున్నాడు. చేతులు వొణుకు తున్నాయి! చలి కొంచెం తీవ్రమయింది. పెదిమలు వొణుకుతున్నాయి. చలి యింకా తీవ్రం అయింది. దవడలు కటకటమంటూ శబ్దం చేస్తున్నాయి. రామం మంచంలో ఎత్తుగా ఎగిరి ఎగిరి పడుతున్నాడు. అంత చలి తనకు తాను పట్టుకోలేకపోతున్నాడు.

అబ్బ తన్ను అదిమి పట్టుకొనేవాడు ఎవరేనా ఉంటే బాగుండేది. కుక్క అతని వొణక దానికె భయపడి ఒక మూలకు పారి పోయింది.

ఇంతలో ఆకాశం పటపటమని ఉరి మింది. ధడేల్ అంటూ మెరుపు. ఆ అదు రుకు గోడ కూలసాగింది. మెల్లిగా రామం మీద ఒక్కొక్క యిటుకే పడసాగింది. కాళ్ళమీద కొన్ని పడ్డాయి. అయినా రామం వొణుకుతూనే ఉన్నాడు. అతనికి తెలియటం లేదు ఏమవుతూందో? తనకాళ్ళు ఎవరో గట్టిగా అదిమి పట్టుకున్నారు. సహాయం వచ్చేసిందన్న మాట. యిక చేతులూ వొళ్ళు దీన్నికూడా అదిమి పట్టుకుంటే ఎవరయినా. మెల్లిగా యింటి కప్పు దిగ సాగింది. రెండు క్షణాల్లో అతని వొంటి మీద పూర్తిగా దిగిపోయింది. ఇప్పుడు రామం వొణకటంలేదు.

ఎవరో తన్ను గట్టిగా పట్టుకున్నారు వొణకకుండా_తనకు సహాయం వచ్చేసింది అన్న సంతృప్తి అతని ముఖాన్ని కప్పి వేసింది అతని ఆఖరు క్షణంలో. ★

